# కాంగ్రెస్‌లో కోమటిరెడ్డి ముసలం

- రాజగోపాల్‌రెడ్డికి టికెట్‌పై ఫైర్
- మునుగోడు నియోజకవర్గంలో దిష్టిబొమ్మల దహనం
- చలమల కృష్ణారెడ్డి వర్గీయుల భేటీ
- కచ్చితంగా మునుగోడు బరిలో ఉంటా : చలమల
- ఉదయపూర్ డిక్లరేషన్ అంటూ బీసీలకు మొండిచెయ్యి
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక్క టికెట్‌తోనే సరిపెట్టిన కాంగ్రెస్

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ జిల్లా కాంగ్రెస్‌లో టికెట్ల లొల్లి జోరుగా సాగుతున్నది. తొలి జాబితాలో కీలక నేతలంతా తమ స్థానాలను పదిల పరుచుకోగా రెండో జాబితాలో మాత్రం తమ ప్రభావాన్ని చూపుతూ పార్టీని నమ్ముకున్న వాళ్లకు అన్యాయం చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో పెద్ద రచ్చే మొదలైంది. కాంగ్రెస్ జెండాను కిందపడేసి బీజేపీ జెండాను ఎత్తుకున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉప ఎన్నికలో పార్టీ కార్యకర్తల పైనే కేసులు పెట్టిస్తే ఆయనకే తిరిగి టికెట్ ఎలా ఇస్తారన్న ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఈ మేరకు టికెట్ ఆశించి భంగపడ్డ పీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల కృష్ణారెడ్డి తీవ్ర స్థాయిలో స్పందించారు. తన అనుచరులతో భేటీ అయ్యి పార్టీ పెద్దలపై మండిపడ్డారు. పరాయిగడ్డ నుంచి వచ్చిన రాజగోపాల్‌రెడ్డి మునుగోడులో రాజ్యమేలుతానంటే ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించారు. శనివారం చలమల కృష్ణారెడ్డి ఓ సెల్ఫీ వీడియోను రిలీజు చేయడంతో పాటు సాయంత్రం పార్టీ కార్యకర్తలు, అనుచరులతోనూ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పెద సంఖ్యలో తరలివచ్చిన అనుచరులు, కార్యకర్తల అభీష్టం మేరకు తన భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాను బరిలో ఉంటానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సచ్చిన శవం అని చెప్పి జెండా కిందపడేసి వెళ్లిన రాజగోపాల్‌రెడ్డి తిరిగి వస్తే.. ఎలా టికెట్ ఇస్తారని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లాలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి వైరస్‌లా మారారని మండిపడ్డారు. వాళ్లిద్దరి కుటుంబాల్లో రెండేసి టికెట్లు తీసుకుని పార్టీ జెండా మోసిన వారికి మొండిచేయి చూపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన తమ్ముడి ప్రయోజనాల కోసం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాలను బొందపెట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. మూడున్నర సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉండి ఏం పని చేయకుండా పార్టీని వదిలేసి వెళ్లిన రాజగోపాల్‌రెడ్డికి మళ్లీ ఎలా టికెట్ ఇస్తారంటూ కాంగ్రెస్ పెద్దలను ప్రశ్నించారు. 'మన పార్టీ జెండా కింద పడిపోతుంటే.. పడిపోయిన జెండాను 15 నెలల నుంచి మోసి, క్యాడర్‌ను నిలబెట్టి, పార్టీని నిలబెట్టి, మంచికి చెడుకు అందుబాటులో ఉన్నటువంటి వాళ్లను మోసం చేస్తరని అనుకోలేదననారు. మమ్మల్ని మోసం చేసిన వాళ్లు అంతకుఅంతకూ అనుభవిస్తన్నారు. రాజగోపాల్‌రెడ్డి లాంటి దుర్మార్గులకు దయచేసి సరైన గుణపాఠం చెప్పాలన్నారు. దయచేసి మేధావులు, విద్యావంతులు, ఓటర్లు ఆలోచించాలని కోరారు. తాను మాత్రం ఖచ్చితంగా మునుగోడు బరిలో ఉంటానని స్పష్టం చేశారు. కార్యకర్తలను కాపాడుకుంటా.. తనకు టికెట్ వచ్చినా రాకపోయిన బరిలో ఉంటానన్నారు. రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ సచ్చింది అని కింద పడేసి.. మళ్లీ పచ్చగుందని చెప్పి కాంగ్రెస్‌కు వచ్చిండు. ఆయన స్వార్థం గురించే పార్టీలను వాడుకుంటున్నడని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాను మునుగోడు గడ్డ మీద పుట్టిన బిడ్డగా చెప్పుతున్నా.. ఎవడో పరాయివాడు వచ్చి మునుగోడును ఏలుతనంటే ఊరుకునేది లేదని, కార్యకర్తలు అర్థం చేసుకుని సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ఏది ?**

కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఎన్నికల హడావుడి మొదలైన నాటి నుంచి ఉదయ్‌పూర్ డిక్లరేషన్ పేరుతో ఇన్నాళ్లు బీసీలను ఊరించి ఊరించి ఊసురుమనిపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒకే ఒక్క సీటు మాత్రమే బీసీలకు కేటాయించి మోసం చేశారు. ఆలేరులో మాత్రమే బీర్ల అయిలయ్యకు టికెట్ కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో ఎస్టీ, ఎస్సీ రిజర్వ్ మూడు మినహాయిస్తే మిగతా అన్ని చోట్ల ఒకే సామాజిక వర్గానికి చెందిన రెడ్డి నేతలే అభ్యర్థులయ్యారు. ఇందులో ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరేసి చొప్పున ఉండడం గమనార్హం. ఎన్నికల షెడ్యూల్‌కు నెల రోజుల ముందు నుంచి ఒక్కో పార్లమెంట్ స్థానంలో రెండు సీట్లను బీసీలకు ఇస్తామని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పలుమార్లు ప్రకటిస్తూ వచ్చారు. అవసరమైతే తన నల్లగొండ టికెట్‌ను సైతం త్యాగం చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. తీరా తన టికెట్ తానే తీసుకోవడమే కాకుండా ఒకే ఒక్క టికెట్‌తో బీసీలను సరిపెట్టారు. భువనగిరిలోనూ బీసీలకే టికెట్ అంటూ పంజాల రామాంజనేయులుగౌడ్, పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్ లాంటి నేతల్లో ఆశలు రేకెత్తించారు. కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోకి రాగానే వీళ్లతో డబ్బులు కూడా ఖర్చు చేయించినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పటివరకు బీసీ నేతలను పావుగా వాడుకుని తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో ఒప్పందం కుదరగానే వారిని విస్మరించారన్న చర్చ సాగింది. ఇప్పటివరకు ప్రకటించిన తొమ్మిది స్థానాల్లో ఒక ఎస్టీ, ఒక ఎస్సీ, ఒక బీసీ అభ్యర్థి కాగా మిగతా ఆరుగురు రెడ్డి సామాజిక వర్గం నేతలే. మిగిలిన మిర్యాలగూడను పొత్తులో భాగంగా సీపీఎంకు, సూర్యాపేటలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డిలో ఒకరు, తుంగతుర్తిలో ఎస్సీ రిజర్వ్‌గా ఉన్నది. కాగా ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ కిందటి మాదిరిగానే కోదాడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాలను బీసీలకు కేటాయించి తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నది. సామాజిక వర్గాల వారీగా ఇప్పటికే అనేక మంది నేతలకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పదవులు కట్టబెట్టిన విషయం తెలిసిందే.



చౌటుప్పల్ : దామెర గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చలమల కృష్ణారెడ్డి

# సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

- ఎంపీపీ యాతాకుల జ్యోతీమధుబాబు
- పలు మండలాల్లో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం



నడిగూడెం : సీఎం సభకు రావాలని చాకిరాల గ్రామస్తులను కోరుతున్న ఎంపీపీ జ్యోతీమధుబాబు

నడిగూడెం, అక్టోబర్ 28 : కోదాడలో ఆదివారం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ యాతాకుల జ్యోతీమధుబాబు కోరారు. సీఎం సభను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని రామాపురం, చాకిరాలలో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందలంటే మన మల్లన్న మరోసారి ఎమ్మెల్యే కావాలన్నారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రతి గడప నుంచి ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చిలుకూరు, అక్టోబర్ 28 : కోదాడలో ఆదివారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎం అవుతారన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ పథకాలే గెలుపునకు దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అల్సకాని జనార్దన్, బెల్లంకొండ నాగయ్య, అంబాల రాంబాబు, కట్టెకోల వెంకన్న, లింగరాజు, పాషా, ఉదయ్ పాల్గొన్నారు.

మునగాల : కోదాడలో సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని రైతుబంధు సమితి మండల కన్వీనర్ సుంకర అజయ్‌కుమార్, మండలాధ్యక్షుడు తొగరు రమేశ్ కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, తొగరు సీతారాములు, సర్పంచ్ వీరంరెడ్డి లింగారెడ్డి, ఎలక వెంకట్‌రెడ్డి, గోపిరెడ్డి, నాగిరెడ్డి, బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోతె : కోదాడలో సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని పీఏసీఎస్ చైర్మన్ కొండపల్లి వెంకట్‌రెడ్డి కోరారు. సీఎం సభను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని బీక్యాతండాలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మద్ది మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ ఝూన్సీబాబూనాయక్, రమేశ్, మదార్, సైదులు నాయక్ పాల్గొన్నారు.



మోతె : సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ కొండపల్లి వెంకట్‌రెడ్డి



చిలుకూరులో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# నేడు జిల్లాకు సీఎం కేసీఆర్

- కోదాడలో ప్రజా ఆశీర్వాద సభ
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, శశిధర్‌రెడ్డి

కోదాడ, అక్టోబర్ 28 : కోదాడలో ప్రజా ఆశీర్వద సభకు సీఎం కేసీఆర్ ఆదివారం హాజరుకానున్నారు. కటకొమ్ముగూడెం బైపాస్‌లోని విశాలమైన 25ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలోని సభకు సీఎం కేసీఆర్ హాజరై ప్రజలు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం ఇస్తూ ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్, పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి శశిధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ, ఎన్నికల ఇన్‌చార్జి తక్కెళ్లపల్లి రవీందర్రావు సభా ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా 6మండలాలతో పాటు కోదాడ పట్టణం నుంచి 75 వేలకు పైగా పార్టీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా హాజరుకానున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌ను దగ్గర నుండి చూడాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.



కోదాడలో సభా వేదిక

# బీఆర్‌ఎస్‌తోనే మరింత అభివృద్ధి

- పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కన్మంతడ్డి శశిధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి శశిధర్‌రెడ్డి

నడిగూడెం, అక్టోబర్ 28 : బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర వహించిన ఉద్యమకారులతో మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కోదాడలో ఆదివారం నిర్వహించే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని కోరారు. బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎన్నికల్లో ప్రతి కార్యకర్త బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బడేటి చంద్ర య్య, మట్టపల్లి శ్రీనివాస్‌గౌడ్, అనంతుల మహేశ్‌గౌడ్, బోనగిరి ఉపేందర్, మేకల గంగరాజు, సతీశ్, కుక్కడపు బాబు, పేరెల్లి కోటయ్య, దున్నా ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, లింగయ్య, శ్రీను, కొండా ఉపేందర్, ప్రదీప్, నర్సయ్య, లక్ష్మీనారాయణ, వీరస్వామి పాల్గొన్నారు.